సాక్షి నంద్యాల
గురువారం । 7 । నవంబర్ । 2024



హంద్రీలో ఇసుక తోడేళ్లు

కోడుమూరు సమీపంలోని హంద్రీ నది నుంచి కొందరు ఇసుకను యథేచ్ఛగా తోడేస్తున్నారు. 400 ట్రాక్టర్లతో పగలు, రాత్రి తేడా లేకుండా తరలిస్తున్నా అడిగేవారు లేరు. 10లో▸



అన్నప్రసాదానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు బుధవారం హైదరాబాద్‌కు చెందిన చెక్కపల్లి లక్ష్మి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,632
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 11,892
అవుట్ ఫ్లో	: 11,532

న్యూస్‌రీల్

పార్వేటకు యునెస్కో గుర్తింపునకు ప్రతిపాదనలు



అహోబిలేశుడి పార్వేట దృశ్యం (ఫైల్)

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలేశుడి పార్వేట మహోత్సవాలకు ప్రపంచ వారసత్వ హోదా వచ్చే అవకాశం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన మంత్రిత్వక శాఖ కార్యదర్శి వినయ్ చంద్ అహోబిలం పార్వేట మహోత్సవాల ప్రాధాన్యతను వివరిస్తూ లేఖ రాశారని అహోబిలం దేవస్థాన నిర్వాహకులు బుధవారం తెలిపారు.

వెండి పూజా సామగ్రి విరాళం



వెండి పూజా సామగ్రిని అందజేస్తున్న దాత

శ్రీశైలంటెంపుల్: రాజమహేంద్రవరానికి చెందిన కె.రామిరెడ్డి దంపతులు వెండితో తయారు చేసిన పూజా సామగ్రిని శ్రీశైల దేవస్థానానికి విరాళంగా అందజేశారు. 485 గ్రాముల శఠగోపం, 435 గ్రాముల వెండి పళ్లెం, 790 గ్రాముల మూడు కిరీటాలను దాతలు బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో అధ్యాపక ఎం.పూర్ణానంద, పర్యవేక్షకులు కె.అయ్యన్నకు అందజేశారు. వారు దాతలకు వేదాశీర్వచనం, స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలను అందించి సత్కరించారు.

శ్రీశైలం డ్యాంలో 184 టీఎంసీల నీరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో బుధవారం సాయంత్రం సమయానికి 183.8486 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 21,654 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం నుంచి బుధవారం వరకు ఎగువ ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి 8,895 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 38,673 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడిగట్టు కేంద్రంలో స్వల్పంగా 0.213 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 8.800 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 879.20 అడుగులకు చేరుకుంది.



ఈ ఫొటోలో రోటరీక్లబ్ అంబులెన్స్‌లో కూర్చున్న వ్యక్తి పేరు పక్కీర. ఇతనిది బేతంచెర్ల. కొన్ని రోజులుగా తీవ్రంగా జ్వరం, దగ్గు, జలుబు వేధించడంతో బుధవారం నడవలేని స్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు అతన్ని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకెళ్లాలని బుధవారం ఉదయం 10.30 గంటలకు 108 కాల్‌సెంటర్‌కు ఫోన్ చేస్తే వాహనాలు ఆగిపోయాయి రాలేవని చెప్పారు. దీంతో రోటరీ క్లబ్ అంబులెన్స్‌లో అతను కర్నూలుకు వచ్చాడు. ఇందుకుగాను అతనికి రూ.1,500ల దాకా ఖర్చు అయ్యింది. ఇతనే కాదు ఉమ్మడి జిల్లాలో ఇలాంటి వారు రెండురోజులుగా వందల మంది ఇలాంటి ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని అంబులెన్స్‌కు పెట్రోల్ బంకుల్లో డీజిల్ వేయడమూ నిలిపివేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. సకాలంలో అపర సంజీవని సేవలు అందక బాధితులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.



కర్నూలులోని 108 కార్యాలయం వద్ద నిలిచిన అంబులెన్స్‌లు

సారీ..మేము రాలేం!

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిలిచిన 108 అంబులెన్స్‌లు
- డీజిల్ వెయ్యని పెట్రోల్ బంకులు
- ఇబ్బంది పడుతున్న రోగులు
- మూడు నెలలుగా ఉద్యోగులకు అందని జీతాలు
- పీఎఫ్, ఈఎస్ఐ కూడా ఇవ్వని వైనం





ప్రైవేటు వాహనాల్లో కర్నూలు పెద్దాస్పత్రికి చికిత్స కోసం వస్తున్న రోగులు

కర్నూలు(హాస్పిటల్): ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు పావు గంటలో చెంతకు చేరే 108 అంబులెన్స్ వాహన రాకపోకలు ఆగిపోయాయి. ఆపదలో ఉన్న వారికి వచ్చిన వెంటనే ఆయువు పోసే ఈ వాహనానికి ప్రభుత్వమే ప్రాణం తీస్తోంది. ఈ వాహనాల నిర్వహణకు నిధులు ఇవ్వకుండా వేధిస్తోంది. ఉన్నఫలంగా వెళ్లిపోవాలంటూ నిర్వహణ సంస్థకు ఆదేశాలు జారీ చేసింది. రెండు రోజులుగా జిల్లాలోని అంబులెన్స్‌కు పెట్రోల్ బంకుల్లో డీజిల్ వేయడమూ ఆపేయడంతో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 45 వాహనాల సేవలు నిలిచిపోయాయి. పరిస్థితి విషమించి ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని భావించి అత్యవసరంగా కొన్ని వాహనాలకు డీజిల్ వేయించి నడిపించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2005 సంవత్సరంలో 108 అంబులెన్స్ సేవలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. మొదట్లో కర్నూలు, ఆదోని, నంద్యాల, శ్రీశైలానికి ఒక్కో వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం 2006లో మరో 28 వాహనాలు వీటికి జతచేరాయి. అన్ని రకాల ప్రమాదాలు, గర్భిణులను, గుండెపోటు, మూర్ఛవ్యాధి, ఇతర అత్యవసర అనారోగ్య పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తరలించడం వంటి సేవలను ఈ వాహనాలు నిర్వర్తించాయి. ఈ సేవలను ఇతర రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలూ మెచ్చుకుని అక్కడా అమలు చేశాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించిన తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఈ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశాయి. వాహనాలు పెంచకపోవడమే గాక ఉన్న వాహనాలకూ మరమ్మతులు చేయించకపోవడంతో ఏ వాహనం ఎప్పుడు ఎక్కడ ఆగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొని ఉండేది. ఉద్యోగులకు సైతం జీతభత్యాలు సరిగ్గా ఇచ్చేవారు కాదు. వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 2020 జూలై నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రతి మండలానికి ఒక వాహనం చొప్పున మొత్తం 57 వాహనాలు కేటాయించారు. ఇందులో కర్నూలు జిల్లాలో 27, నంద్యాల జిల్లాలో 30 ఉన్నాయి. ఇందులో చిన్నారుల ప్రాణాలను రక్షించేందుకు గాను ఆదోని, నంద్యాలలో అత్యాధునిక నియోనేటల్ వాహనాలు కూడా ఏర్పాటు చేశారు. ప్రతి వాహనంలో అత్యాధునిక బీఎల్ఎస్(బేసిక్ లైఫ్ సపోర్ట్) వసతులు కల్పించారు. గిరిజన ప్రాంతాల్లో ఇబ్బందులు రానీయకుండా 10 వాహనాలు కేటాయించారు. వీటి ద్వారా 133 మంది పైలెట్లు, ఎంఎల్‌టీలు సేవలందిస్తున్నారు. కేవలం రోడ్డు ప్రమాదాలు, అత్యవసర మెడికల్ సర్వీసులకు, గర్భిణులను ఆసుపత్రులకు తరలించడమే కాదు గర్భిణులకు ప్రతి నెలా 9వ తేదీన వైద్యపరీక్షలకు తీసుకెళ్లడం, డయాలసిస్ రోగులను, క్యాన్సర్ రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లడం వంటి సేవలు అందిస్తున్నాయి. 2020 జూలై నుంచి ఇప్పటి వరకు 5లక్షల మందికి పైగా ఆపదలో ఉన్న వారిని 108 వాహనాల ద్వారా సేవలు అందించారు.

108 అంబులెన్స్ సేవలను నిర్వహించే అరబిందో సంస్థను వెళ్లగొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మంగళవారం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 అంబులెన్స్ వాహనాలకు సంబంధిత పెట్రోల్ బంకుల్లో డీజిల్ పోయడాన్ని ఆపేశారు. ఆయా పెట్రోల్ బంకుల్లో నిర్వహణ సంస్థ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ డీజిల్ వేయడాన్ని నిలిపేశారు. ఈ కారణంగా ఉమ్మడి జిల్లాలోని 57 వాహనాల్లో

ఇంధనం లేక ఆగిన వాహనాలు

బుధవారం ఉదయానికి 45 వాహనాలు నిలిచిపోయాయి. వాస్తవంగా ప్రతి సంవత్సరం ఉమ్మడి జిల్లాలోని అంబులెన్స్ వాహనాలకు డీజిల్ ఖర్చు రూ.60 లక్షల దాకా అవుతుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఇస్తే నిర్వహణ సంస్థ పెట్రోల్ బంకులకు చెల్లిస్తుంది. కానీ కొంత కాలంగా ప్రభుత్వం నిధులు ఇవ్వడం మానేయడంతో ప్రస్తుత పరిస్థితి నెలకొంది. దీంతో కర్నూలుతో పాటు ఆలూరు, కోసిగి, కౌ తాలం, దేవనకొండ, ప్యాపిలి, డోన్, ఆదోని, నందికొట్కూరు, మిడుతూరు, చిప్పగిరి, నందవరం, పెద్దకడబూరు, మద్దికెర, రాయలసీమ యూనివర్సిటీ, పత్తికొండ, సి.బెళగల్, వెల్దుర్తి, పత్తికొండ, ఆదోని బీఎల్ఎస్, ఆదోని ఏఎల్ఎస్, తుగ్గలి, హాలహర్వి ప్రాంతాల్లో వాహనాలు నిలిచిపోయాయి.

అంబులెన్స్ ప్రత్యేకతలు

- ఆదోని, నంద్యాలలకు ఒక్కోటి చొప్పున నియోనేటల్ అంబులెన్స్‌లు
- 108 వాహనాల్లో 13 అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్(ఏఎల్ఎస్), 42 బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్) వాహనాలు
- నడిచే ఐసీయూ తరహాలో ఏఎల్ఎస్ సౌకర్యం ఉన్న వాహనంలో వెంటిలేటర్, డీఫిబ్రిలేటర్, ఇన్‌ఫ్యూజన్ పంప్స్, సిరంజి పంప్స్ ఏర్పాటు
- ప్రతి అంబులెన్స్‌లో ఆక్సిజన్, సక్షన్ ఆపరేటర్స్, మల్టీ పారా మానిటర్స్, అత్యవసర మందులు అందుబాటులో ఉంటాయి.
- ప్రతి వాహనంలో నియోనేటల్ వార్మింగ్ బ్లాంకెట్స్



కర్నూలు మొత్తానికి ఈ ఒక్క 108 అంబులెన్స్ మాత్రమే నడిచింది

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 108 అంబులెన్స్ సేవలు

సంవత్సరం	సేవలు అందుకున్న వారి సంఖ్య
2020 (జూలై నుంచి డిసెంబర్ వరకు)	27,593
2021	1,18,891
2022	90,954
2023	1,13,281
2024 (ఇప్పటివరకు)	92,089

జీతభత్యాలూ సరిగ్గా ఇవ్వడం లేదు



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 67 మంది పైలెట్లు, 66 మంది ఈఎంఎల్‌టీలు పనిచేస్తున్నారు. వీరందరికీ మూడు నెలలుగా జీతభత్యాలు ఇవ్వడం లేదు. ఐదేళ్ల నుంచి గ్రాట్యుటీ, బోనస్ అందలేదు. నెలనెలా వేయాల్సిన పీఎఫ్ వేయలేదు. రిలీవింగ్ బిల్స్ రావడం లేదు. ఎక్స్‌ట్రా డ్యూటీలకు సంబంధించిన బిల్లులూ రాలేదు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి నిర్వహణ సంస్థచే మాకు జీతభత్యాలు వచ్చేలా చేయాలి. – టి. రాంబాబు, 108 కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎప్పుడూ ఈ పరిస్థితి రాలేదు



108 అంబులెన్స్‌లు సర్వీసులు ప్రారంభమైనప్పటి నుంచి ఏనాడూ ప్రస్తుత పరిస్థితి రాలేదు. ఒక్క కర్నూలు జిల్లాలోనే డీజిల్ లేక 18 వాహనాలు ఆగిపోగా నంద్యాల జిల్లాతో కలిపి 40కి పైగా వాహనాలు ఆగిపోయాయి. దీనివల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రోగుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నిధులు విడుదల చేయాలి. ఉద్యోగులకు కూడా మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే జీతాలు విడుదల చేయాలి. – జి.రాజేష్‌కుమార్‌రెడ్డి, 108 కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం



జిల్లాలో డీజిల్ సమస్య కారణంగా 108 అంబులెన్స్ వాహనాలు చాలా వరకు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. పరిస్థితిని అర్థం చేసుకుని రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 108 అంబులెన్స్ నిర్వహణ సంస్థచే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయించాము. ఈ మేరకు ఆయా అంబులెన్స్‌లకు డీజిల్ వేయించి తిరిగేలా చేశాము. బుధవారం సాయంత్రానికి జిల్లాలో 27లో 24 వాహనాలు తిరుగుతున్నాయి. ప్రతి పాయింట్‌లో వాహనాలు ఉండి రోగులకు సేవ చేసేలా ఏర్పాట్లు చేశాము. – డాక్టర్ ఎల్. భాస్కర్, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

నా కొడుకు ఏం తప్పు చేశాడని అడిగినా చెప్పలేదు

- తిరుమల కృష్ణ తండ్రి కొండయ్య ఆవేదన

మహానంది: పశువులకు మేత పెడుతున్న నా కొడుకుని ఏం తప్పు చేశాడని తీసుకెళ్తున్నారని అడిగినా పోలీసులు చెప్పకుండా జీపులో ఎక్కించుకుని వెళ్లారని వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా జిల్లా కో కన్వీనర్ తిరుమల కృష్ణ తండ్రి కొండయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. కూటమి ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడనే కారణంతో బొల్లవరం గ్రామానికి చెందిన తిరుమల కృష్ణ అలియాస్ జగన్ కృష్ణను ఈనెల 3న రాత్రి పోలీసులు తీసుకెళ్లారు. ఈఘటనపై ఆయన తండ్రి కొండయ్య, భార్య భారతి బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు రాత్రి మా ఇంటికి వచ్చి తిరుమల ఎక్కడున్నాడని అడిగారన్నారు. ఇంట్లోకి ప్రవేశించి అంతా వెతికారని, ఆ తర్వాత పశువుల పాక వద్ద మేత వేస్తున్న కృష్ణను బలవంతంగా జీపులో ఎక్కించుకుని తీసుకెళ్లారన్నారు. రాత్రి మహానంది పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన కుమారుడు ఎక్కడ ఉన్నాడని అడిగితే కర్నూలుకు తీసుకెళ్లినట్లు చెప్పారన్నారు. ఇంటికి ఎప్పుడొస్తాడోనని ఎదురు చూస్తున్నామని తండ్రి, భార్య ఆవేదన వ్యక్తం చేశారు.



కృష్ణ కోసం ఎదురు చూస్తున్న తండ్రి కొండయ్య, భార్య భారతి

నోటీస్ లేకుండా అరెస్ట్ చేశారు

కృష్ణకు నోటీసులు ఇవ్వకుండా పోలీసులు అరెస్ట్ చేశారు. కర్నూలుకు చెందిన ఒకరు రాత్రి పది గంటలకు ఫిర్యాదు చేయగా, 11.30 గంటలకు కేసు రిజిస్టర్ చేశారు. అయితే రాత్రి 8.30 గంటలకే పోలీసులు గ్రామానికి చేరుకుని అరెస్ట్ చేయడం తగదు. 41 నోటీస్ లేకుండా అరెస్ట్ చేసి ఎక్కడికి తీసుకెళ్తున్నారో కుటుంబ సభ్యులకు కూడా చెప్పకుండా బలవంతంగా తీసుకెళ్లడం ప్రభుత్వ కుట్రలో భాగమే. – ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు

రూ.10 లక్షలు ఇస్తావా.. ఇంటి వద్ద కూర్చుంటావా!

- సస్పెన్షన్‌ను ఎత్తివేయడానికి ఉన్నతాధికారి పెద్ద మొత్తంలో డిమాండ్

కర్నూలు(సెంట్రల్): రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో ఓ సబ్ రిజిస్ట్రార్‌పై ఉన్న సస్పెషన్‌ను ఎత్తివేయడానికి ఓ ఉన్నతాధికారి ఏకంగా రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ సబ్ రిజిస్ట్రార్ అంత ఇచ్చుకోలేనని వేడుకోగా 'ఉద్యోగం కావాలంటే డబ్బులివ్వు.. లేదంటే ఇంటి వద్దే కూర్చో' అంటూ ఉచిత సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న సదరు సబ్ రిజిస్ట్రార్‌ను ఐదు నెలల క్రితం క్రమశిక్షణ చర్యల కింద సస్పెండ్ చేశారు. దీంతో ఆయన తనను అన్యాయంగా సస్పెండ్ చేశారని హైకోర్టును ఆశ్రయించారు. అప్పుడు సదరు ఆ అధికారి అతనికి ఉద్యోగం ఇవ్వడానికి వీలు లేదని హైకోర్టుకు నివేదించారు. దీంతో కోర్టు అతనిపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయడానికి అంగీకరించలేదు. ఓ ఉద్యోగిపై ఉన్న సస్పెన్షన్‌ను 5 నెలల తరువాత పరిశీలించి ఎత్తి వేయాలి. అయితే అందుకు ఉన్నతాధికారి రూ.10 లక్షలు ఇవ్వాలని, డబ్బు ఇస్తేనే పని అవుతుందని, లేదంటే లేదని ఖరాకండిగా చెప్పేశారు. దీంతో సదరు సబ్ రిజిస్ట్రార్ అంత ఇచ్చుకోలేనని, సస్పెన్షన్‌లో ఉన్నానని, కాస్తా తనపై కనికరం చూపాలని కోరినా వినిపించుకోలేదని సమాచారం. డబ్బు ఇస్తేనే కార్యాలయానికి రావాలని లేదంటే ఇంటి దగ్గర ఉండాలని సూచినట్లు తెలుస్తోంది. దీంతో సబ్ రిజిస్ట్రార్‌కు ఏమి చేయాలో దిక్కుతోచక అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. కాగా ఉన్నతాధికారిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగులకు అనుకూలమైన స్థానాల్లో పోస్టింగ్ ఇచ్చేందుకు డబ్బులు ఇవ్వాల్సిందేనని సిబ్బంది బహిరంగంగా చెప్పుకుంటున్నారు. డిప్యుటేషన్లకు కూడా డబ్బు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లపై కూడా సస్పెన్షన్ ఎత్తేశారు. వారి నుంచి కూడా భారీ స్థాయిలో డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం సందర్భంగా ప్రతి సోమవారం ఓంకారం, మహానంది, భోగేశ్వరం, యాగంటి, కాల్వబుగ్గ ఆలయాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి రజియాసుల్తానా తెలిపారు. బుధవారం ఆమె మాటాడుతూ జిల్లాలోని అన్ని డిపోల నుంచి శ్రీశైలానికి ప్రతి ఆది, సోమవారాల్లో బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా 15న అరుణాచలానికి(టికెట్ చార్జ్ రూ.1750) ప్రత్యేక బస్సును నడుపుతామన్నారు. భక్తులు బ్యాచ్‌లుగా ముందుకు వస్తే వారి కోసం సంబంధిత డిపోల నుంచి ప్రత్యేక బస్ సర్వీసును ఏర్పాటు చేస్తామన్నారు. ప్యాకేజీ టూర్ కింద ఒకే రోజులో పంచ శైవ క్షేత్రాలకు ఆది, సోమవారాల్లో బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. నంద్యాల డిపో నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరి మహానంది, ఓంకారం, భోగేశ్వరం, యాగంటి, కాల్వబుగ్గకును చుట్టేసి రాత్రి 9 గంటలకు తిరిగి నంద్యాలకు చేరుకుంటుందన్నారు. కోవెలకుంట్ల నుంచి కన్నేతీర్థం, నయనాలప్ప, ఓంకారం, మహానంది, యాగంటిలకు కూడా బస్సు సర్వీస్ ఏర్పాటు చేశామన్నారు. నంద్యాల డిపో నుంచి ఉదయం 6.30 గంటలకు బయలుదేరి రాత్రి 8.30 గంటలకు కోవెలకుంట్ల డిపోకు చేరుతుందన్నారు. అలాగే శబరిమలకు వెళ్లేందుకు భక్తులు బ్యాచ్‌లుగా వస్తే అద్దె ప్రాతిపదికన బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు.

పడిపోతున్న వేరుశనగ ధర

కర్నూలు(అగ్రికల్చర్): వేరుశనగ ధరలు పతనం అవుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధరలు పడిపోవడంతో రైతులు నష్టాలు మూట కట్టుకుంటున్నారు. రబీ సీజన్‌కు సంబంధించి సబ్సిడీపై పంపిణీ చేసే వేరుశనగ క్వింటాలు ధర రూ.9,600గా నిర్ణయించింది. మార్కెట్‌లో అధిక మంది రైతులకు సగటు ధరనే లభిస్తుంది. గత నెల 22వ తేదీన సగటు ధర క్వింటం రూ. 5,891 కాగా 29న రూ. 4,689 పిలికింది. ఈనెల 4వ తేదీ రూ.4,459 ఉండగా బుధవారం సగటు ధర రూ. 4,100 లభించింది. వేరుశనగకు మద్దతు ధర రూ.6,783 ఉంది. మార్కెట్‌లో కేవలం రూ.4,500 వరకు మాత్రమే లభిస్తోంది. ధరలు పడిపోయినపుడు రైతులు నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మైనింగ్ అధికారుల మాయ

- నిబంధనల పేరుతో వరుస దాడులు
- ఆందోళనలో యజమానులు
- ఉపాధి కోల్పోతున్న కార్మికులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాపరాతి గనుల యజమానులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. కొద్ది రోజుల నుంచి బెలుం, బెలుం శింగవరం, మీర్జాపురంతోపాటు పలు గ్రామాల్లో భూగర్భ గనులు, విజిలెన్స్ అధికారులు నిబంధనల పేరుతో నాపరాతి గనులపై వరుస దాడులు చేస్తున్నారు. మైనింగ్ లీజులున్నా ఏదో ఒక కారణం చూపి కేసులు నమోదు చేసి కోత మిషన్లను పోలీస్ స్టేషన్లకు తరలిస్తుండటంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు.



బెలుం సమీపంలో నిర్మానుష్యంగా మారిన గనులు



కోత మిషన్‌లను స్టేషన్‌కు తరలించేందుకు ట్రాక్టర్‌లో ఎక్కిస్తున్న దృశ్యం (ఫైల్)

కొలిమిగుండ్ల: బనగానపల్లె నియోజవర్గంలోని కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె మండలాల్లో 1,150 హెక్టార్లలో నాపరాతి గనులు విస్తరించి ఉన్నాయి. 720 మంది లీజుదారులు ఉన్నారు. లీజులు లేకుండా మరో 400 మంది మేర గనుల తవ్వకాలు చేస్తున్నట్లు సమాచారం. అదికూడా ఒకటి, రెండు సెంట్ల విస్తీర్ణంలో చిన్న, చిన్న గనుల తవ్వకాలు చేసేవారే ఎక్కువ. మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం.. ఇటీవల కక్ష సాధింపు చర్యలకు దిగింది. పథకం ప్రకారం వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న వారి గనులపై అధికారులు ఇటీవల వరుస దాడులు చేస్తుండటంతో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత పది రోజుల నుంచి బెలుం, బెలుం శింగవరం, మీర్జాపురంతో పాటు పలు గ్రామాల్లో భూగర్భ గనులు, విజిలెన్స్ అధికారులు లీజులు లేకుండా అక్రమ మైనింగ్ చేస్తున్నారనే పేరుతో నాపరాతి గనులపై వరుస దాడులు చేస్తున్నారు. వారం రోజుల క్రితం బెలుం సమీపంలో గనులు చేస్తున్న కనకాద్రిపల్లె, బెలుంకు చెందిన ప్రసాదు, సుబ్బారావు, రమణ గనుల్లో తనిఖీలు చేసి పది కోత మిషన్‌లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేయకుండా, జరిమానా విధించకుండా స్టేషన్ చుట్టూ తిప్పుకుంటూ ఇబ్బంది పెట్టడమే ధ్యేయంగా దాడులు సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. కాగా కూటమి నాయకులు లీజు లేకుండా గనులు చేస్తున్నా వారిపై అధికారులు కన్నెత్తి చూడటం లేదు.

భయంభయంగా యజమానులు

వరుస దాడులతో లీజులున్న యజమానులు సైతం ఆందోళన చెందుతున్నారు. కొంత మందికి లీజు గడువు ముగిసినా ప్రభుత్వం రెన్యువల్ చేయడం లేదు. రెండు నెలల నుంచి లీజుదారుల ఐడీలు, పాస్‌వర్డ్‌లు హోల్డ్‌లో పెట్టి రాయల్టీలు విడుదల కాకుండా చేశారు. ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్(ఈసీ) మంజూరు చేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని యజమానులు వాపోతున్నారు. మరోవైపు ఈసీ, మైనింగ్ ప్లాన్ తదితర కారణాలు చూపి దాడులు చేస్తుండటంతో యజమానులు పనులు ఆపేసి దాదాపు 200 కోత మిషన్లను ఇళ్లకు తరలించుకుపోయారు. కాగా ఇంత ఇబ్బందులు పెడుతుండటాన్ని బట్టి త్వరలోనే మైనింగ్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

కార్మికులపై ప్రభావం

నియోజకవర్గంలో నాపరాతి గనులపై ఆధారపడి 20 వేల మంది మేర కార్మికులు జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం గనుల్లో పనులు నిలిపేయడంతో కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే నాపరాతి పరిశ్రమ కుదేలైంది. ఉత్పత్తి ఉన్నా గిట్టుబాటు ధర, ఎగుమతి లేక కష్టాల్లో కూరుకుపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో అధికారుల దాడులు చేయడంతో యజమానులు, కార్మికులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే వలసలు పోవాల్సి వస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పని లేక ఖాళీగా ఉన్నా



గనులపై అధికారులు దాడులు చేస్తుండటంతో గనులు బంద్ చేశారు. లోడింగ్ పనులు చేస్తుంటాను. మూడు రోజుల నుంచి పని లేక ఖాళీగా ఉండాల్సి వస్తుంది. ఈపని మీదనే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఇతర ఏ పని రాదు. నాలాగా ఎంతో మంది కార్మికులు గనులపై ఆధారపడ్డారు. ఇంకా ఎన్నాళ్లు ఖాళీగా ఉండాలో అర్థం కావడం లేదు. – సూర్యనారాయణ, కార్మికుడు

గనులే ఆధారం



25 ఏళ్ల నుంచి నాపరాతి గనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. కొద్ది రోజుల నుంచి అధికారులు వరుసగా దాడులు చేస్తుండటంతో భయపడి గనులు బంద్ చేసి కోత మిషన్ ఇళ్లకు తెచ్చుకున్నాను. గనులకు అప్పు చేశాం. పనులు జరగకపోతే వాటిని తీర్చడం కష్టంగా ఉంటుంది. యజమానులు, కూలీలకు దిక్కుతోచడం లేదు. ఇప్పటికే గనుల పరిస్థితి దారుణంగా ఉంది. – గురవయ్య, గని యజమాని

లీజులకు దరఖాస్తు చేసుకోండి



చాలా మంది లీజులు లేకుండా అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. దరఖాస్తు చేసుకుంటే లీజులు ఇస్తాం. ఇటీవల మూడు సార్లు దాడులు చేశాం. లీజు లేకుండా నడుపుతున్న గనుల యజమానుల కోత మిషన్‌లను పోలీస్ స్టేషన్‌లో అప్పగించాం. త్వరలోనే వారికి నోటీసులు అందించి జరిమానా విధిస్తాం. – వేణుగోపాల్, మైనింగ్ ఏడీ, నంద్యాల

క్లుప్తంగా

ప్రాంగణ నియామకాల్లో 141 మందికి ఉద్యోగాలు

కర్నూలు సిటీ: నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 141 మంది ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ కె.గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి బుధవారం కాలేజీలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 116 మంది యాక్సెంచర్‌లో రూ.4.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. అలాగే రూ.6.75 లక్షల ప్యాకేజీతో 8 మంది, రూ.4.02 లక్షల ప్యాకేజీతో 9 మంది కాగ్నిజెంట్ (సీటీఎస్)లో ఎంపికయ్యారన్నారు. రూ.4 లక్షల ప్యాకేజీతో ఏడుగురు క్యాప్టియస్‌కు, ఒకరు అసెట్సెన్స్ కంపెనీలో రూ.8 లక్షల ప్యాకేజీతో ఎంపికయ్యారని, మరో మూడు కంపెనీల ఫలితాలు రావాల్సి ఉందన్నారు. ఆయా విభాగాధిపతులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఉల్లి ధర!

- గరిష్ట ధర రూ.4849, సగటు ధర రూ.3896



కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి ధర జోరు మీద ఉంది. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధరలు మరింత పెరగాల్సి ఉన్నప్పటికీ వ్యాపారులు సిండికేట్ అవుతుండటం వల్ల పెరుగుదల అంతంత మాత్రంగానే ఉన్నట్లుగా రైతులు పేర్కొంటున్నారు. మంగళవారం నాటితో పోలిస్తే మార్కెట్‌కు ఉల్లిగడ్డలు ఎక్కువగా వచ్చాయి. ధర కూడా పెరిగింది. ఈ నెల 5వ తేదీన మార్కెట్‌కు ఉల్లి 6,879 క్వింటాళ్లు వచ్చాయి. గరిష్ఠంగా రూ.4,669 ధర లభించింది. బుధవారం మార్కెట్‌కు 479 మంది రైతులు 9,589 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులను తెచ్చారు. కనిష్ఠంగా క్వింటాలుకు రూ.622, గరిష్ఠంగా రూ.4,849 ధర లభించింది. సగటు ధర కూడ రూ.3,896 నమోదైంది. సగటు ధర స్వల్పంగా తగ్గింది. సగటు ధరను బట్టి చూస్తే వ్యాపారులు సిండికేట్ అయ్యారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

హంద్రీలో ఇసుక తోడేళ్లు

- రోజుకు 400 నుంచి 500 ట్రాక్టర్ల ఇసుక అక్రమ తరలింపు
- వర్కూరు నుంచి కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండకు సరఫరా
- భవిష్యత్‌లో కోడుమూరు వాసులకు ఇసుక కూడా కరువే



వర్కూరు వద్ద హంద్రీ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం



ఇసుకను తోడేయడంతో పిచ్చిమొక్కలతో అడవిని తలిపిస్తున్న హంద్రీ నది

కోడుమూరు రూరల్: మండలంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. హంద్రీ నది నుంచి ఇసుకను యథేచ్ఛగా తోడేస్తున్నారు. వర్కూరు గ్రామం వద్ద హంద్రీ నది నుంచి రోజుకు 300 నుంచి 400 ట్రాక్టర్లతో పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను తరలించుకుపోతున్నారు. ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలించరాదని నిబంధనలున్నా అవేవీ ఇక్కడ అమలు కావడం లేదు. వర్కూరు హంద్రీ నుంచి కర్నూలు, గూడూరు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, పత్తికొండ లాంటి ప్రాంతాలకు ఇసుకను తరలించుకుపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. హంద్రీ నుంచి భారీగా ఇసుకను తరలించుకుపోతుండడంతో భవిష్యత్‌లో ఈ ప్రాంత వాసులకు ఇసుక దొరకని పరిస్థితి ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. ప్రతి రోజు వందలాది ట్రాక్టర్లతో ఇసుకను తరలించుకుపోతుండడంతో మరో 10 నుంచి 15 రోజుల్లో హంద్రీలోని ఇసుకంతా ఖాళీ అయ్యే ప్రమాదం ఉంది.

కోడుమూరుకు పొంచిఉన్న నీటి సమస్య

వర్కూరు, కోడుమూరు, ముడుమలగుర్తి, క్రిష్ణాపురం, వెంకటగిరి, గోరంట్ల, లద్దగిరి, ప్యాలకుర్తి, అనగొండ, అమడగుంట్ల, ఎర్రదొడ్డి వంటి గ్రామాల్లోని మంచినీటి పథకాలకు హంద్రీలోని బోర్ల ద్వారానే నీటిని సరఫరా చేస్తారు. ఇప్పటికే హంద్రీలో ఇసుకమేటలు లేకపోవడంతో నీళ్లు నిల్వ ఉండని పరిస్థితి నెలకొంది. ఉన్న కాస్త ఇసుకను కూడా తరలిస్తే భవిష్యత్‌లో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చే ప్రమాదముంది. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరుకు నీటి సమస్య పొంచి ఉంది. ఇప్పటికే హంద్రీలో నీటి నిల్వలు తగ్గిపోవడంతో 3 నుంచి 4 రోజులకోసారి పంచాయతీ అధికారులు కుళాయిలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఉన్న కాస్త ఇసుకను కూడా తరలిస్తే నీటి సమస్య తీవ్రమవుతుందని, ఇసుక తరలింపును ఇతర ప్రాంతాలకు ఆపాలంటూ 2 రోజుల కిందట మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు, పాలకవర్గం సభ్యులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో నిత్యం వందలాది ట్రాక్టర్ల ఇసుక ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిపోతుంది. దీంతో రాబోయే రోజుల్లో కోడుమూరులో ఇసుక, నీటి నిల్వలు తగ్గి సమస్య తీవ్రమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

అడవిని తలపిస్తున్న కోడుమూరు హంద్రీ

ఇప్పటికే కోడుమూరు వద్ద హంద్రీ నదిలో ఇసుకను తోడేయడంతో పిచ్చిమొక్కలు పెరిగి అడవిని తలపిస్తోంది. హంద్రీలో అక్కడక్కడ ఉన్న కాస్త ఇసుకను కూడా ఇప్పుడు తరలిపోతుండడంతో భవిష్యత్‌లో కోడుమూరు ప్రజలకు నీటి సమస్యతో పాటు, ఇసుక కూడా దొరకని స్థితి నెలకొంటుంది. ఇకనైనా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలింపును ఆపాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఇసుక తరలింపును ఆపాలి

వ్యాపారస్తులు ప్రతి రోజూ హంద్రీ నది నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇసుక తరలింపును ఆపాలని గత సోమవారం తహసీల్దార్‌కు పాలకవర్గ సభ్యులతో కలిసి విన్నవించాం. హంద్రీలో ఇసుక ఖాళీ అవుతే నీళ్లు నిలబడవు. ఇప్పటికే కోడుమూరులో నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఉన్న కాస్త ఇసుక కూడా తరలిస్తే కోడుమూరు ప్రజలకు నీటి కష్టాలు తప్పవు.

– అజయ్‌భాస్కర్, ఈఓ, కోడుమూరు మేజర్‌గ్రామ పంచాయతీ

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



గొల్ల విజయ్‌కుమార్ (ఫైల్)

డోన్ రూరల్: మండల పరిధిలోని ఓబులాపురం గ్రామానికి చెందిన రైతు గొల్ల విజయ్‌కుమార్ (42) మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు.. రైతు విజయ్‌కుమార్ 25 ఎకరాలను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నాడు. మూడేళ్లుగా సరైన దిగుబడులు రాకపోవడంతో దాదాపు రూ.10 లక్షలు అప్పు చేశాడు. అప్పు తీర్చలేక ఇబ్బందులు పడతుండటంతో మనస్తాపానికి గురై పొలంలోనే పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కోలుకోలేక బుధవారం విజయ్‌కుమార్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారిణులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రుక్సాన పర్వీన్

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు జాతీయస్థాయి పోటీలకు ఎన్నికైనట్లు ప్రిన్సిపాల్ రుక్సాన పర్వీన్ తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ.. గత నెల 29, 30 తేదీల్లో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు చెప్పారు. అండర్–14 రోప్ స్కిప్పింగ్‌లో విద్యార్థిని సంగీత రెండో స్థానంలో నిలువగా, సుస్మిత 30 సెకెన్స్ స్పీడ్ విభాగంలో 3వ స్థానంలో నిలిచిందన్నారు. వారు ఈ నెల 29, 30 తేదీల్లో గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావడం అభినందనీయమన్నారు. క్రీడాకారిణులను, శిక్షణ ఇచ్చిన పీఈటీ శిరీషను అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి పాఠశాలతో పాటు గ్రామానికి మంచి పేరు తీసుకొని రావాలని సూచించారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఆత్మకూరు విద్యార్థి

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని షేక్ అప్సానా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలలో విద్యార్థినిని అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఇటీవల నెల్లూరు జిల్లాలో రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో యోగా ట్రెడిషనల్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించిందన్నారు. దీంతో తమిళనాడులో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఆత్మకూరు చరిత్రలోనే యోగాలో ఓ బాలిక జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడం మొదటిసారి అని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు దేవానంద్, యోగా శిక్షకుడు షేక్ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం



షబీనా (ఫైల్)

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామం మద్దూర్ నగర్‌కు చెందిన ఇస్మాయిల్ భార్య షబీనా ఇంట్లో గొడవ పడి ఈనెల 2వ తేదీన ఇద్దరు పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. పలుచోట్ల గాలించడంతో పాటు బంధువుల వద్ద ఆరాతీసినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె తల్లి ఫాతిమాబీ బ్రాహ్మణకొట్కూరు పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయిందని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ తిరుపాలు చెప్పారు. మహిళకు 35 ఏళ్ల వయస్సు ఉంటుందని, కూతురు ముసిఫీర్, కుమారుడు ముజహిద్ తీసుకెళ్లిందని, ఆచూకీ తెలిసిన వారు 91211 01191 సెల్ నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

వాటర్‌ప్లాంట్‌కు తాళం

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో ఉన్న వాటర్‌ప్లాంట్‌ను బుధవారం పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకుని మూసేసినట్లు నిర్వాహకులు బండి మార్గరేట్, ఆమె భర్త చంద్రపాల్ తెలిపారు. వారు మాట్లాడుతూ 2017లో ఎంపీ నిధులలో భాగంగా సామగ్రి ఇవ్వగా రూ. 2,66,500 ఖర్చుతో గదిని నిర్మించామని, ప్లాంట్ నిర్వహించుకుంటూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. అయితే తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే గ్రామ పంచాయతీ స్థలంలో ఉందని పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచాయతీ అధికారులు వాటర్‌ప్లాంట్ తాళం పగలగొట్టి మరొక తాళం వేశారన్నారు. తాము ఎస్సీలమనే కుల వివక్షతోనే ఇలా కక్షపూరితంగా చేశారని వారు వాపోయారు. ఈ విషయంపై బుధవారం రాత్రి మహానంది పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా వాటర్‌ప్లాంట్ ప్రభుత్వ స్థలంలో ఉందని, గ్రామసభలు నిర్వహించి తీర్మానం చేసిన తర్వాతనే స్వాధీనం చేసుకున్నామని పంచాయతీ సెక్రటరీ లక్ష్మీప్రసన్న వివరించారు. ఉన్నట్లుండి వాటర్‌ప్లాంట్‌కు తాళాలు వేయడంతో తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయని గ్రామస్తులు వాపోయారు.

యురేనియం కోసం బోర్ల తవ్వకాలు జరగడం లేదు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో యురేనియం లభ్యత, పరిశోధన కోసం ఎలాంటి బోర్ల తవ్వకాలు జరగడం లేదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఓ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వదంతులను నమ్మవద్దని కోరారు. ప్రజల విన్నపాలు, నిరసనలు, ఆందోళనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

యురేనియం తవ్వకాలపై ప్రచారాలు నమ్మొద్దు

కర్నూలు (టౌన్): కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులో యురేనియం తవ్వకాలపై వస్తున్న వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని జిల్లా ఎస్పీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియాలో చేస్తున్న అసత్య ప్రచారాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందవద్దని సూచించారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు (టౌన్): కర్నూలు నగర శివారులోని పంచలింగాల చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. బుధవారం తెలంగాణ నుంచి ద్విచక్ర వాహనంలో వస్తున్న ఒక వ్యక్తిని ఆపి సోదాలు చేయగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన 34 మ్యాన్షన్ హౌస్ మద్యం బాటిళ్లు, 15 ఓల్డ్ అడ్మిరల్ బాటిళ్లు మొత్తం 49 బాటిళ్లు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కృష్ణ వెల్లడించారు. మద్యం తరలిస్తున్న సల్కాపురం గ్రామానికి చెందిన కుమ్మరి గోకారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామంలో వేమారెడ్డి గారి హనుమంతు అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం తరలించి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు కోసిగి ఎక్సైజ్ సీఐ పి. భార్గవ్ రెడ్డి తెలిపారు. బుధవారం కర్నూలు డీటీఎఫ్ స్క్వాడ్ సీఐ రాజేంద్ర ప్రసాద్, కోసిగి ఎక్సైజ్ సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటించి దాడులు నిర్వహించామన్నారు. ఈ క్రమంలో దుద్ది గ్రామంలో హనుమంతు వద్ద నుంచి 224 ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. దాడుల్లో కోసిగి ఎక్సైజ్ ఎస్‌ఐ కార్తీక్ సాగర్, డీటీఎఫ్ ఎస్‌ఐ ఇంద్ర కిరణ్ తేజ, కోసిగి హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కిషోర్, కానిస్టేబుల్ మునిరంగడు,రవి, బషీర్ బాషా, లాలప్ప, భరత్ పాల్గొన్నారు.

ఆదోని రూరల్:మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన గాదిలింగప్ప అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇస్వీ ఎస్‌ఐ నాగేంద్ర విలేకరులకు తెలిపారు. గాదిలింగప్ప కేఏ 21 ఈఈ 5927 నంబర్ గల హోండా యూనికార్న్ మోటార్ సైకిల్‌పై కర్ణాటక రాష్ట్రం నాగరహాల్ నుంచి 15 మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా పెద్దహరివాణం–ఇంగళదహాల్ గ్రామాల మధ్యలోని ఎల్లెల్సీ కాలువపై పట్టుకున్నామన్నారు.

రైల్వే నోటిఫికేషన్ విడుదల చేయాలి



రైల్వే స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను రిటైర్డ్ అయిన ఉద్యోగులతో కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం అన్యాయమని, వెంటనే ఆ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యేటేటా దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతుంటే..వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం ఆటలు ఆడుతోందన్నారు. అడపాదడపా నోటిఫికేషన్‌లు వచ్చే రైల్వే రంగంలోనూ రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవాలని నిర్ణయించడం దారుణమన్నారు. ఖాళీగా ఉన్న 2.98 లక్షల ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగప్ప, సురేష్, విజయ్ పాల్గొన్నారు.

ఆర్‌టీఓ సేవల ప్రైవేటీకరణ తగదు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆటో యూనియన్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆర్‌టీఓ కార్యాలయ సేవలను ప్రైవేటీకరిస్తే ఆటోల బంద్‌కు పిలుపునిస్తామని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోటార్ వెహికల్ యాక్ట్ సవరణతో వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియను ప్రైవేట్‌కు అప్పగించేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందన్నారు. మోటార్ వాహనాలకు సంబంధించి విడుదల చేసిన జీఓ నంబర్ 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కుమార్, నాగరాజు, వెంకటస్వామి, బడేబాషా పాల్గొన్నారు.

11న అప్రెంటిస్ మేళా

కర్నూలు సిటీ: ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారికి ఈ నెల 11వ తేదీన అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ బాలికల ఐటీఐ కాలేజీల కన్వీనర్ ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్, మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఐటీఐ కాలేజీల్లో చదివిన నిరుద్యోగ యువతీ, యువకులకు అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళాకు జిల్లాలోని వివిధ పారిశ్రామికవేత్తలు హాజరై అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్రెంటిస్ రిజిస్ట్రేషన్ పోర్టల్ https://apprenticeshipindia.gov.in నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఒరిజినల్ ధ్రువపత్రాలతో బి.తాండ్రపాడులోని ప్రభుత్వ బాలికల ఐటీఐ కాలేజీలో జరిగే మేళాకు హాజరుకావాలని సూచించారు.

గ్యాస్ సిలిండర్ల దొంగ అరెస్ట్

బండిఆత్మకూరు: స్థానిక వారధి వద్ద గ్యాస్ సిలిండర్లతో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. తన సిబ్బందితో కలిసి బండిఆత్మకూరు కేసీ కెనాల్ వారధి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా, గ్యాస్ సిలిండర్లతో మోటర్ సైకిల్‌పై వెళ్తున్న బిళ్లలాపురం గ్రామానికి చెందిన జగటి తేజ రామయ్యను విచారించామన్నారు. అతడు బండిఆత్మకూరు భారత్ గ్యాస్ గోడౌన్ నుంచి 31 సిలిండర్‌లను, సంతజూటూరు గ్రామంలోని రామకృష్ణ చికెన్ సెంటర్ నుంచి 5 హెచ్‌పీ గ్యాస్ సిలిండర్‌లను కలిపి మొత్తం రూ.1.30లక్షల విలువ గల 36 సిలిండర్లను దొంగిలించినట్లు తెలిసిందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని ఆత్మహత్య

గడివేముల: మద్యం తాగేందుకు కుటుంబసభ్యులు డబ్బులు ఇవ్వకపోవడంతో విరక్తి చెంది కరిమద్దెల గ్రామానికి చెందిన ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బషీర్ (19) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బుతో మద్యం తాగేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై కుటుంబసభ్యులను వేధించసాగాడు. వారు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఘటనపై తండ్రి షేక్షావలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఏఎస్‌ఐ వివరించారు.

శిక్షణ తరగతులను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల (న్యూటౌన్): రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆరు రోజులపాటు నిర్వహించనున్న లీడర్షిప్ రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.మధుసూదన్ రావు, రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు సాంబశివుడు, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, నగిరి శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. లీడర్షిప్ శిక్షణలో ఉన్న పశ్చిమగోదావరి జిల్లా, ఉండూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట రత్నకుమార్ బుధవారం గుండెపోటుతో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షణ కార్యక్రమాలను ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా మొండిగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల అపార్ నమోదు, పదో తరగతి పరీక్షల నామినల్ రోల్స్, ఫీజుల చెల్లింపు, సెల్ఫ్ అసెస్మెంట్ – 2 పరీక్షల పని ఒత్తిడితోపాటు వయోభారం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని శిక్షణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు మల్లెల పుల్లయ్య, మానపాటి రవి, పవన్ కుమార్, ఆవుల మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం మృతికి ప్రభుత్వానిదే బాధ్యత

అగిరిపల్లి శిక్షణా కార్యక్రమంలో హెచ్‌ఎం మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని నంద్యాల జిల్లా ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. శిక్షణ కేంద్రాల సంఖ్యను పెంచి నాన్ రెసిడెన్సియల్ విధానంలో తరగతులు నిర్వహించాలని కోరారు. అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్‌టీయూ, పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జాబ్‌మేళాలో 32 మందికి ఉద్యోగాలు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 5వ తేదీన నిర్వహించిన జాబ్‌మేళాలో 32 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు నగరంలో జరిగిన జాబ్ మేళాకు మొత్తం 95 మంది అభ్యర్థులు హాజరుకాగా.. టాటా క్యాపిటల్, ఎస్‌వీసీ సినిమాస్, శ్రీరామ్‌చిట్స్ అండ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు తమ అవసరాలకు సరిపడా విద్యార్హతలు ఉన్న 32 మంది అభ్యర్థులను ఎంపిక చేసుకున్నట్లు వెల్లడించారు.

తాగునీటి ట్యాంకుల క్లీనింగ్‌కు ‘డ్రైవ్’



పెంచికలపాడులో నీటి ట్యాంకు పరిసరాలను పరిశీలిస్తున్న డీపీఓ భాస్కర్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి ట్యాంకులను (ఓహెచ్‌ఎస్‌ఆర్, జీఎల్‌ఎస్‌ఆర్) క్లీన్ చేసేందుకు ఈ నెల 12వ తేదీ వరకు డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జీ.భాస్కర్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. క్లీన్ డ్రైవ్‌ను పక్కాగా నిర్వహించేందుకు జిల్లాలోని డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశామన్నారు. అన్ని వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు తర్వాత 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా ట్యాంకుల వద్ద బోర్డులపై శుభ్రం చేసిన తేదీ, తదుపరి శుభ్రం చేసే తేదీలను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఆయా ట్యాంకుల నుంచి కుళాయిలకు నీటిని సరఫరా చేసే 30 నిమిషాల ముందు తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలన్నారు. ట్యాంకుల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. పబ్లిక్ కుళాయిలు, హ్యాండ్ పంప్‌ల వద్ద నిలిచిన నీటిని తొలగించాలని, నీటి వృథాను అరికట్టేందుకు అవసరమైన పనులు చేపట్టాలన్నారు. ఈఓఆర్‌డీలు, డీఎల్‌పీఓలు ట్యాంకులను శుభ్రం చేసిన వివరాలను ఫార్మాట్ ప్రకారం నివేదికల అందించాలని డీఈఓ ఆదేశించారు.

ఆగని టీడీపీ విధ్వంసం



క్రిష్టిపాడు ఆర్‌బీకే వద్ద ధ్వంసమైన నవరత్నాల బోర్డు ముక్కలను చూపుతున్న సర్పంచ్ శివరామిరెడ్డి

దొర్నిపాడు: టీడీపీ నాయకుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ప్రభుత్వ కార్యాలయాలు, రైతు భరోసా కేంద్రాల వద్ద ఉన్న శిలాఫలకాలు, నవరత్నాల బోర్డులను ధ్వంసం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో మంగళవారం ఇదే విధంగా విధ్వంసానికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ వ్యక్తులు మద్యం సేవించి సచివాలయంలోకి వచ్చి వీరంగం సృష్టించారు. ఏంటనీ ప్రశ్నించేందుకు ఉద్యోగులు భయపడి పోయారు. గుణపం చేతపట్టుకొని శిలాఫలకాలను తీసేస్తాం అంటూ హల్‌చల్ చేశారు. అక్కడే ఉన్న కొంతమంది అడ్డుకోవడంతో ఊరి బయట ఉన్న ఆర్‌బీకే వద్దకు వెళ్లి నవరత్నాల బోర్డును ధ్వంసం చేశారు. గతంలోనూ ఆర్‌బీకే కిటికీ అద్దాలను గుర్తుతెలియని దుండగులు పగలగొట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం సరికాదు

ఎవరి హయాంలో నిర్మించినా అవి ప్రభుత్వ భవనాలే. అభివృద్ధిలో పోటీ పడాలి తప్పా రాజకీయ వైరంతో ఇలాంటి దుశ్చర్యలకు ఒడగట్టడం తగదు. గ్రామాభివృద్ధికి చిహ్నాలుగా ఉన్న కార్యాలయాలపై దాడులు చేయడం హేయమైన చర్య. ఇలాగైతే ఉద్యోగులు తమ విధులను ఎలా నిర్వర్తిస్తారు. ప్రభుత్వ కార్యాలయాలపై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి.

–శివరామిరెడ్డి, సర్పంచ్, క్రిష్టిపాడు